క్లుప్తంగా

పోస్టాఫీసులో పార్శిల్ ప్యాకింగ్ యూనిట్

ఒంగోలు వన్‌టౌన్: స్థానిక చర్చి సెంటర్‌లోని హెడ్ పోస్టాఫీసులో పార్శిల్ ప్యాకింగ్ యూనిట్‌ను బుధవారం ప్రారంభించినట్లు ప్రకాశం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ మహ్మద్ జాఫర్ సాధిక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యూనిట్‌లో పార్శిల్స్ ప్యాకింగ్ చేసినందుకు కనీస రుసుం మాత్రమే వసూలు చేస్తామన్నారు. పోస్టల్ శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

ఒంగోలు టౌన్: వైద్యం కోసం వచ్చిన వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఒంగోలు తాలూకా పోలీసుల కథనం ప్రకారం.. జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట గ్రామానికి చెందిన ఇనకొల్లు వెంకట సుబ్బారావు ఆరోగ్యం బాగాలేకపోవడంతో చికిత్స కోసం బుధవారం ఉదయం ఒంగోలు వచ్చాడు. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకున్నాడు. తిరిగి వెళుతున్న సమయంలో వేగంగా వచ్చిన టాటా ఏష్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బధిర విద్యార్థులకు పండ్ల పంపిణీ

ఒంగోలు వన్‌టౌన్: స్థానిక భాగ్యనగర్ 4వ లైన్‌లోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు దోస్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ ఎస్‌కే మహబూబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మార్నెళ్ల సుబ్బారావు, ప్రిన్సిపాల్ టి.పద్మజ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేద ముస్లిం అంత్యక్రియలకు చేయూత



మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పిస్తున్న మైనారిటీ కమిటీ సభ్యులు

ఒంగోలు టౌన్: నగరంలోని బలరాం కాలనీకి చెందిన షేక్ జిలానీ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మరణించారు. నిరుపేద కుటుంబానికి చెందిన జిలాని అంత్యక్రియలు చేయడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆ కుటుంబం తల్లడిల్లుతుండగా, ఆ విషయాన్ని ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ ఎకనమికల్ డెవలప్మెంట్ సొసైటీ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దాంతో కమిటీ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాదర్‌వలి వెంటనే స్పందించి మృతుడి అంత్యక్రియలకు రూ.8 వేల ఆర్థికసాయాన్ని అతని కుటుంబ సభ్యులకు అందజేశారు.


తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



సమీక్షిస్తున్న స్పెషలాఫీసర్ శ్రీహరి, ఎంపీడీఓ ప్రసాద్

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని ప్రతి గ్రామంలో తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని మండల స్పెషలాఫీసర్ శ్రీహరి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రసాద్ అధ్యక్షతన మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. మండలంలోని అభివృద్ధి పనులపై చర్చించారు. ఎంపీపీ బీ విజయ, పీఆర్ ఏఈ వీరాంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మధుసూదన రావు, మణిప్రసాద్, మాధవరావు, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర కలిగిన పంటలు మాత్రమే వేయాలి



నల్ల బర్లీ పొగాకు సాగు నిషేధంపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శాంతి

కొత్తపట్నం: మద్దతు ధర కలిగిన పంటలు మాత్రమే రైతులు సాగుచేయాలని తహసీల్దార్ శాంతి సూచించారు. మండలంలోని ఆలూరు గ్రామంలో నల్ల బర్లీ పొగాకు సాగు నిషేధంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జి.కిషోర్ బాబు అధ్యక్షత వహించగా, తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు నల్లబర్లీ పొగాకు సాగు చేయవద్దన్నారు. దానివలన రైతుకు నష్టం వస్తుందన్నారు. కనీస మద్దతు ధర కూడా ఉండటం లేదని తెలిపారు. ఆలూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ డాక్టర్ మహేష్, వ్యవసాయ విస్తరణ అధికారి అజయ్, వీఏఏలు శిరీష, కల్పన, కోటేశ్వర రావు, నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

- జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పిలుపు
- చీమకుర్తి మున్సిపాలిటీలో కౌన్సిలర్లు, కార్యకర్తలతో సమావేశం
- పట్టణ బూత్ కమిటీ కన్వీనర్‌గా సోమా శేషాద్రి నియామకం



కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మేరుగు నాగార్జున

చీమకుర్తి: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మాజీ మంత్రి, పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి చీమకుర్తిలోని బూచేపల్లి కార్యాలయంలో చీమకుర్తి మున్సిపాలిటీలోని కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ బూత్‌ల వారీగా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికలలో తాను సంతనూతలపాడు నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని కార్యకర్తలందరికీ అందుబాటులో ఉండి కలుపుకుని పోతానని భరోసా ఇచ్చారు. చీమకుర్తి పట్టణంలోని 20 వార్డులలో 24 బూత్‌లు ఉన్నాయని, వాటికి బూత్‌ల వారీగా వైఎస్సార్ సీపీ తరఫున కన్వీనర్లను నియమించుకుందామని తెలిపారు. దానిలో భాగంగా బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో చీమకుర్తి పట్టణ బూత్ కమిటీ కన్వీనర్‌గా ప్రస్తుత కౌన్సిలర్ సోమా శేషాద్రిని ఏకగ్రీవంగా నియమించారు. అనంతరం బూత్‌ల వారీగా కన్వీనర్లను కూడా నియమించే బాధ్యతలను సోమా శేషాద్రి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, నాయకులు తీసుకోవాలని సూచించారు. కన్వీనర్‌లను నియమించుకుంటూ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రతి బూత్ వారీగా బాబూ ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహించుకుందామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గోగినేని వెంకటేశ్వర్లు, చల్లా అంకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్.మాణిక్యం, కౌన్సిలర్లు సోమా శేషాద్రి, పత్తి కోటేశ్వరరావు, పాటిబండ్ల గంగయ్య, బీమన వెంకట్రావు, తప్పెట బాబూరావు, గోపురపు చంద్ర, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, కంజుల ప్రతాప్‌రెడ్డి, బడే అయ్యపరెడ్డి, ఆముదాలపల్లి రామబ్రహ్మం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగం తగ్గించుకోవాలి



మద్దిపాడులో రైతులతో మాట్లాడుతున్న నియోజకవర్గ స్పెషలాఫీసర్ వరకుమార్



బూదవాడలో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ రాజశేఖర్

మద్దిపాడు: అధికంగా ఎరువుల వాడకం తగ్గించి నానో యూరియా, డీఏపీ ఉపయోగించుకోవాలని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ వరకుమార్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ అధికారిణి స్వర్ణలత ఆధ్వర్యంలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం అలవాటు చేసుకోవాలని, తద్వారా భూమి ఆరోగ్యాన్ని, మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ అజయ్, నందిపాడు సొసైటీ అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, పొగాకు బోర్డు సభ్యుడు అబ్బూరి శేషగిరిరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, అన్ని గ్రామాల రైతులు, సొసైటీల సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి...

చీమకుర్తి రూరల్: భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులు వాడాలని మండల స్పెషలాఫీసర్ రాజశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని బూదవాడ గ్రామంలో యూరియా వినియోగం, ఎరువుల లభ్యతపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, వ్యవసాయ అధికారి భాస్కర్, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా




ధర్నా చేస్తున్న గుండ్లాపల్లి ఎస్సీకాలనీ వాసులు

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి సర్వీస్ రోడ్డులో మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో నీళ్ల ట్యాంకర్ ఢీకొని దార్ల ఉదయ్ రాజ్ కుమార్ (30) మృతిచెందిన విషయం విధితమే. అతని కుటుంబానికి న్యాయం చేయాలని గుండ్లాపల్లి ఎస్సీకాలనీ వాసులు కల్యాణి ఆక్వా యాజమాన్యాన్ని అడిగిన నేపథ్యంలో కంపెనీ వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో మృతుని భార్య, పిల్లలతో కలిసి కాలనీ వాసులు ఆక్వా కంపెనీ గేటు బయట బుధవారం ధర్నా నిర్వహించారు. మృతుని కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. మృతుని భార్య రష్మిత రోదిస్తున్న తీరు ప్రజలను కలచివేసింది. ఎస్ఐ సైదులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని కంపెనీ వారితో సంప్రదింపులు జరిపారు.

మండల పరిషత్ కార్యాలయం తనిఖీ

చీమకుర్తి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి బుధవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డుల రూంను సందర్శించి ఫైల్స్ సర్దుబాటుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరిపాలనాధికారి వజ్జా శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు



ప్రత్యేక అలంకరణలో కార్యసిద్ధి వినాయకుడు

ఒంగోలు మెట్రో: జిల్లా వ్యాప్తంగా సంకటహర చతుర్థి పూజలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒంగోలు కర్నూలు రోడ్డు శ్రీనగర్ కాలనీలోని మొదటి లైన్లో విజయ గణపతి దేవస్థానంలో, పీర్లమాన్యం మణికంఠ నగర్లోని కార్యసిద్ధి గణపతి దేవస్థానంలో, ఒంగోలు బైపాస్ ఫ్లై ఓవర్ దగ్గరున్న వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో, అద్దంకి బస్టాండ్ వినాయకస్వామి దేవస్థానంలో, నెల్లూరు బస్టాండ్ విఘ్నేశ్వర దేవస్థానంలో, కర్నూల్ రోడ్డు పాలకేంద్రం దగ్గర ఇండస్ట్రియల్ ఎస్టేట్ దగ్గర ఉన్న సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో, ఒంగోలు కొండమీద శ్రీగిరి దేవస్థానం దగ్గర ఉన్న వినాయక స్వామి ఆలయంలో బుధవారం ఉదయం విశేష పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాల అభిషేకం, సుగంధ పరిమళ ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి స్వామివారికి ప్రీతికరమైన గరికతో అష్టోత్తర శతనామావళి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అభిషేకాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రైవేటు వారికి అప్పగించొద్దు

ఒంగోలు టౌన్: స్థానిక పాత కూరగాయల మార్కెట్ స్థలంలో కాంప్లెక్స్ నిర్మాణాన్ని ప్రైవేటు పరం చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాస రావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగర పాలక సంస్థ నిధులతోనే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయాలని కోరారు. నగరపాలక సంస్థ ఆదాయాన్ని పెంచుకునేందుకు మార్కెట్ స్థలంలోని 0.83 ఎకరాల విస్తీర్ణంలో రెండంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు చెబుతున్నారని, దాన్ని పీపీపీ పద్ధతిలో చేయడం సరైన నిర్ణయం కాదని అన్నారు. నగరం నడిబొడ్డున వందల కోట్ల రూపాయల విలువైన భూములను పీపీపీ పేరుతో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే ఇలాంటి నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆరోపించారు. నగరపాలక సంస్థ స్వయంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి షాపులను అద్దెలకు కేటాయించడం ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కుట్రలను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.

సరళీకృత బోధన కోసమే బీఓఎస్ సమావేశం



మాట్లాడుతున్న ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మూర్తి

- ఏకేయూ వీసీ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి

ఒంగోలు సిటీ: విద్యా బోధనను సరళీకృతం చేసేందుకు, సకాలంలో సిలబస్ తయారు చేసుకుని బోధనను పూర్తి చేయడంతో పాటు పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి తదితర అంశాలను నిర్వహించడం కోసం బీఓఎస్ సమావేశాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. బుధవారం స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీ సమావేశపు హాలులో యూజీ బీఓఎస్ సమావేశం నిర్వహించారు. డీన్ అకడమిక్స్ డాక్టర్ కే గంగాధర్ అధ్యక్షత వహించగా, ఆంధ్రకేసరి యూనివర్సిటీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, ఇతర యూనివర్సిటీల నుంచి 13 విభాగాలలో 36 మేజర్లు, 36 మైనర్లు, 18 మల్టీ డిసిప్లీనరి కోర్సులు, ఒక స్కిల్ కోర్సు (ఇంట్రడక్షన్ టు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) తరఫున హాజరైన బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, సభ్యులు, ఎక్స్ అఫీసియో సభ్యులనుద్దేశించి వీసీ మూర్తి మాట్లాడారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యాంశాల బోధన, సిలబస్ రూపకల్పన, తదితర విషయాలను ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సూచనలను దృష్టిలో ఉంచుకుని తయారు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మారిన కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులను దృష్టిలో ఉంచుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, క్వాంటమ్ టెక్నాలజీ తదితర బోధనా విషయాలపై విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించాలని ఆయన సూచించారు. బీఓఎస్ చైర్మన్లు, సభ్యులు సిలబస్ రూపకల్పనలో ఉన్నత విద్యా మండలి సూచించిన విధంగా తయారు చేసుకుని అందుకు అనుగుణంగా పాఠ్యాంశాలు బోధించాలని తెలిపారు. యూజీ బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశానికి మొత్తం 60 మంది హాజరు కావడం జరిగిందని అకడమిక్స్ డీన్ డాక్టర్ గంగాధర్ తెలిపారు. కెమిస్ట్రీ డిపార్టుమెంట్ ఎక్స్ ఆఫీసియో సభ్యునిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు బోర్డు చైర్మన్, సభ్యులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిర్మలామణి, ఓఎస్‌డీ ప్రొఫెసర్ జి.రాజమోహన్‌రావు, ఏకేయూ డీన్ అకడమిక్స్ డాక్టర్ కే గంగాధర్ తదితరులు మాట్లాడారు. సమావేశంలో ఏకేయూ అధ్యాపకులు, పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



వైఎస్ జగన్‌తో చుండూరి రవిబాబు, కఠారి శంకరరావు, మన్నే శ్రీనివాసరావు

వైఎస్ జగన్‌ను కలిసిన చుండూరి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు బుధవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలను జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, ఒంగోలు రూరల్ మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాస రావు, జిల్లా కార్యదర్శి గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు.



వైఎస్ జగన్‌తో చుండూరి రవిబాబు, కఠారి శంకరరావు, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి

ప్రభుత్వాస్పత్రి, హైస్కూల్ ఆకస్మిక తనిఖీ



సంతనూతలపాడు ప్రభుత్వ హాస్పిటల్లో ఓపీ రికార్డును పరిశీలిస్తున్న మండల స్పెషలాఫీసర్ శ్రీహరి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండల నూతన స్పెషలాఫీసర్, జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శ్రీహరి బుధవారం సంతనూతలపాడు ప్రభుత్వ హాస్పిటల్, స్థానిక హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట ప్రభుత్వ హాస్పిటల్‌ను సందర్శించి ఓపీ విభాగాన్ని పరిశీలించారు. మధ్యాహ్నానికి 44 ఓపీని రికార్డులో నమోదు చేయగా, కంప్యూటర్లోనూ తనిఖీ చేశారు. హెచ్‌ఆర్ రికార్డులు, వ్యాక్సిన్ రూము, ల్యాబ్, వార్డు రూములు, వైద్యుల రూములు, ఫార్మసీ సెంటర్ను పరిశీలించారు. వార్డు రూముల్లో చికిత్స పొందుతున్న ప్రజలతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం సంతనూతలపాడు హైస్కూల్ను సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. హెచ్ఎం ప్రమోద, ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రసాద్, ఎంపీపీ బుడంగుంట విజయ, సంతనూతలపాడు, మైనంపాడు సర్పంచులు దర్శి నాగమణి, డి.రమణ, ఎంఈఓ చంద్రమౌళేశ్వర్, పంచాయతీరాజ్ ఏఈ వీరాంజనేయులు, ఏపీవో వాసంతి, వైద్యులు సుధామణి, నాగరాజు, శ్రీధర్, సీహెచ్ఓ మాధవరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్మాన్ మందిర్లలో మరిన్ని ఆరోగ్య సేవలు

ఒంగోలు టౌన్: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లలో మరిన్ని ఆరోగ్య సేవలు అందించేందుకు వున్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు కేంద్రం నుంచి వచ్చిన అజయ్ మిత్ర తెలిపారు.

బుధవారం స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయాన్ని కేంద్ర బృందం సందర్శించగా, ఆ బృందానికి నాయకత్వం వహిస్తున్న అజయ్ మిత్ర మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, స్వతంత్ర ధ్రువీకరణ ఏజెన్సీల ద్వారా జిల్లాలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ల ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఎంపిక కాబడిన ఆయుష్మాన్ మందిర్‌లో చెక్ లిస్టు ప్రకారం అందుతున్న వైద్య సేవలను పరిశీలించి తద్వారా మరింత మెరుగైన సేవలందించేందుకు ఉన్న అవకాశాలను పరిశీస్తున్నట్లు చెప్పారు. డీఎంహెచ్ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర బృందం పరిశీలించే ప్రాంతంలో స్థానిక వైద్య బృందం పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. సమావేశంలో డీఎల్‌టీ శ్రీవాణి, జిల్లా ఉప వైద్యాధికారి వాణిశ్రీ, డీపీఎం డా.సౌజన్య, ఎన్‌సీడీ నోడల్ అధికారి భగీరథి, ఎఫ్‌డీపీ నోడల్ అధికారి శ్రావణ్‌కుమార్, నబి వలి, డీపీఓ సుబ్బలక్ష్మి, డెమో శ్రీనివాసులు, డీడీఎం ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో స్పెషలాఫీసర్ పర్యటన



మద్దిపాడు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంతో మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ వరలక్ష్మి, ఎంపీడీఓ జ్యోతి

మద్దిపాడు: మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి బుధవారం మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యక్రమాలను నిర్వహించడానికి గదులేమైనా ఖాళీగా ఉన్నాయా అంటూ స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వెనుక వైపు ఉన్న భవనాన్ని పరిశీలించారు. ఆ గదులు వినియోగంలో ఉన్నాయా అంటూ పాఠశాల హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. ఆ గదులు విద్యార్థులకు సరిపోతాయని, అందువలన గదులు ఇవ్వలేమంటూ హెచ్‌ఎం తెలిపారు. అనంతరం పీహెచ్‌సీని పరిశీలించి మండలంలో జ్వరాలున్నాయా అని అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. మందులు సరిపడా ఉన్నాయని, 48 టెస్టులు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి డాక్టర్ శ్రావణ్ తెలిపారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణాలను ఆమె పరిశీలించారు. చివరిగా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బంగారు బాల్యం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆమె వెంట ఎంపీడీఓ వి.జ్యోతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆకాశాన ‘నారింజ’ వాన



జడి వానకు తెరలేచిందా.. కరిమబ్బులు కమ్ముకొస్తాయా.. అనుకునేలోపు నల్లని మేఘాల మాటున సూరీడు దాగుడు మూతలు ఆడాడు. తెల్లని.. లేత నీలి రంగుల మధ్య నారింజ పండ్ల రసం ఆకాశ వీధుల్లో కుమ్మరించినట్లు అనిపించింది. ఈ సుందర దృశ్యం బుధవారం సాయంత్రం ఒంగోలు నగరవాసులకు కనువిందు చేసింది. – ఒంగోలు సిటీ